సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 5 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.33 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు పలికాయి. మార్కెట్‌కు 216 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 215 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం 37.1°/10.3°
జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

13న జరగాల్సిన పరీక్షలు వాయిదా

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఈ నెల 13న జరగాల్సిన ఎంబీఏ, ఎంసీఏ (రెండో సెమిస్టర్) సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేశామన్నారు. వాయిదా పడ్డ పరీక్షలు ఈ నెల 14న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఈ అంశాన్ని అన్ని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు గమనించాలని కోరారు.

2.62 లక్షల మందికి పింఛన్ సొమ్ము అందజేత



బొంతలపల్లిలో పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటీర్ కేశవ

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. జిల్లాలో 2,65,194 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులుండగా, వారి కోసం ప్రభుత్వం రూ.73.62 కోట్లు విడుదల చేసింది. దీంతో వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో నాలుగోరోజు నాటికి 2,61,428 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందింది. పంపిణీకి మరో రోజు సమయం ఉన్నందున అందరికీ పింఛన్ మొత్తం అందేలా చూస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

18న స్పెషల్ లోక్ అదాలత్

అనంతపురం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 18న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మూడో శనివారం (18న) ఉదయం 10:30 గంటలకు స్పెషల్ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), వినియోగదారుల ఫోరంలో ఉన్న కేసులు, ఐపీఆర్ కేసులను రాజీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రచారం.. ఉత్సాహం



కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు...అన్ని వర్గాలకూ న్యాయం ..బడుగులకు రాజ్యాధికారం.. అందరి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో సీఎం జగన్ పాలన సాగిస్తుండగా...అధికార పార్టీ నేతలు వాటినే అస్త్రాలుగా చేసుకుని పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఊరూవాడా ఏకం చేస్తూ మద్దతు కూడగడుతున్నారు. ప్రతిపక్ష టీడీపీ మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. ఇన్నాళ్లూ ప్రజలకు దూరంగా ఉన్న నేతలు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వెళ్లాలో తెలియక అల్లాడిపోతున్నారు. తమ్ముళ్లను నమ్ముకుని బరిలో నిలిచిన వారు తలలు పట్టుకుంటున్నారు.



పుట్టపర్తి: గజరాజుపల్లి పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

3,30,124	28,148
పట్టభద్రుల స్థానం జిల్లా ఓటర్లు	ఉపాధ్యాయ స్థానం జిల్లా ఓటర్లు
పోలింగ్ జరిగే తేదీ : మార్చి 13	
ఓట్ల లెక్కింపు : మార్చి 16	

'పట్టభద్రుల' బరిలో నిలిచిన ప్రముఖులు
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి (టీడీపీ), పోతుల నాగరాజు (పీడీఎఫ్)తో కలిపి మొత్తం 49 మంది పోటీలో నిలిచారు.

'ఉపాధ్యాయుల' బరిలో నిలిచిన ప్రముఖులు
ఎంవీ రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), ఒంటేరు శ్రీనివాసరెడ్డి (ఏపీటీఎఫ్), కత్తి నరసింహారెడ్డి (యూటీఎఫ్)తో కలిపి మొత్తం 12 మంది పోటీలో ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- ప్రచారం ముమ్మరం చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- ఊరూవాడా చుట్టేస్తున్న నేతలు, ప్రతినిధులు
- ఓటమి భయంతో చాప చుట్టేసిన టీడీపీ
- చాలా నియోజకవర్గాల్లో కనిపించని తమ్ముళ్లు
- ఉనికి చాటుకునేందుకు టీడీపీ అభ్యర్థి పాట్లు

సాక్షి, పుట్టపర్తి: పెద్దల పోరు సమీపిస్తుండగా... వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం ముమ్మరం చేశారు. ఇప్పటికే స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికకాగా, ఆ విజయోత్సాహంతో అభ్యర్థులతో పాటు ఎన్నికల ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లాలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. బృందాలుగా ఏర్పడి గ్రామాల వారీగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తే కలిగే లాభాల గురించి వివరిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాల నుంచి మంచి స్పందన లభిస్తుండటంతో రెండు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యత తీసుకున్న ఎమ్మెల్యేలు..
జిల్లా కేంద్రం ఎమ్మెల్యే పుట్టపర్తి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో పాటు కదిరిలో పీవీ సిద్దారెడ్డి, పెనుకొండలో శంకరనారాయణ, మడకశిరలో డాక్టర్ తిప్పేస్వామి, ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వయంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. హిందూపురంలోనూ ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఇక ఎంపీ మాధవ్ సైతం పార్టీ తరఫున బరిలో నిలిచిన వారికి మద్దతుగా రోజుకో చోట ప్రచారం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల సంఘం నిర్ణయించిన విధి విధానాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నారు. 'పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన తర్వాత అక్కడ సిబ్బంది ఇచ్చిన పెన్నునే వినియోగించాలి. ప్రథమ ప్రాధాన్య ఓటును అభ్యర్థి ఫొటో పక్కనే గడిలో 1 అని రాయాలి. అంతేకానీ ఒకటి, వన్ అని రాయకూడదు. ఈ ఎన్నికలో రాజకీయ పార్టీల గుర్తులు కనిపించవు. ఓటర్లు గందరగోళం పడకుండా అభ్యర్థి ఫొటో ఆధారంగా ఓటు వేయాల్సి ఉంటుంది' అని ఓటర్లను చైతన్యపరుస్తున్నారు.

ముందే చాప చుట్టేసిన టీడీపీ..
ఓటమి ఖాయమని తెలిసి టీడీపీ ముందే చాప చుట్టేసింది. ఉపాధ్యాయుల కోటాలోని రెండు (పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ) స్థానాల్లో పోటీ నుంచి తప్పుకుంది. కేవలం పట్టభద్రుల స్థానంలో మాత్రమే అభ్యర్థిని బరిలో నిలిపింది. అయితే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించడంలో విఫలం అవుతున్నారు. ఓడిపోతామని తెలిసి నిరుత్సాహంలో పడ్డారు. అంతేకాకుండా గతంలో ఏం చేశామని ఓటు అడగాలనే నిర్ణయానికి వచ్చి ఓటర్ల ముందుకు వెళ్లేందుకు జంకుతున్నారు. టీడీపీ ఏకైక ఎమ్మెల్యే బాలకృష్ణ ఇప్పటికీ నియోజకవర్గంలో కనిపించలేదు. ధర్మవరంలో ఆ పార్టీ బాధ్యులెవరో తమ్ముళ్లకే తెలియని పరిస్థితి. కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిరతో సహా మిగతా నియోజకవర్గాల్లోనూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు ఉనికిపాట్లు పడుతుండగా... టీడీపీ అభ్యర్థి దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

వైఎస్సార్‌సీపీకి ఎందుకు ఓటేయాలంటే..
వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను విజ్ఞప్తి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు ఎందుకు వేయాలనే దానిపై ప్రశ్నించిన వారికి కూడా వివరంగా సమాధానం చెబుతున్నారు.
- కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ విధించిన సమయంలోనూ వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజాసేవలో ముందుకొచ్చారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఇంటింటా సేవ చేయగా, టీడీపీ నేతలు ఇంటికే పరిమితమయ్యారు.
- వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. టీడీపీ ఏనాడూ ప్రజల గురించి పట్టించుకోలేదు.
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సఫలీకృతులయ్యారు.
- వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక నామినేటెడ్ పదవులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. టీడీపీ హయాంలో కొన్ని వర్గాలకే పదవులు కట్టబెట్టారు.

ఇలా.. వివిధ అంశాలపై ఓటర్లకు సమగ్రంగా వివరణ ఇచ్చి.. ఓటు అభ్యర్థిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే కలిగే ప్రయోజనాల గురించి స్పష్టంగా వివరిస్తున్నారు.

రీ సర్వే పకడ్బందీగా సాగాలి



దేమకేతేపల్లి వద్ద చెక్‌పాయింట్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

సోమందేపల్లి/చిలమత్తూరు: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష' కింద జిల్లాలో చేపట్టిన రీ సర్వే పకడ్బందీగా సాగాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన సోమందేపల్లి మండలంలోని పందిపర్తి, చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలోని యగ్నిశెట్టిపల్లి గ్రామాల్లో పర్యటించారు. తొలుత పందిపర్తి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించిన ఆయన...అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. రీ సర్వేకు సంబంధించి రైతులకు ముందస్తుగా నోటీసులివ్వాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావు ఇవ్వకుండా సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం సోమందేపల్లి మండలంలోని మాగే చెరువు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చెక్‌పాయింట్ల పరిశీలన..
అనంతరం చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి పంచాయతీ యగ్నిశెట్టి పల్లి గ్రామ పొలాల్లో సర్వే చెక్ పాయింట్(సీపీ)లను కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వేలో భూములు సరిహద్దులు ఎలా గుర్తించారో సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. ఒక చెక్ పాయింట్‌ను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మొరంపల్లి వద్ద గ్రానైట్ పరిశ్రమల్లో ఆర్డర్ ఇచ్చిన హద్దురాళ్ల కొలతలు తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ కార్తిక్, తహసీల్దార్లు నాగరాజు, మురళీకృష్ణ, చిలమత్తూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్, సోమందేపల్లి ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆయా మండలాల సర్వేయర్లు, ఉపాధి హామీ అధికారులు ఉన్నారు.

కూలీలందరికీ 'ఉపాధి' కల్పించాలి
కొత్తచెరువు: కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల పరిధిలోని లోచర్ల గ్రామంలో 'అమృత్ సరోవర్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీడీ విజయేంద్రప్రసాద్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



హంసవాహనంపై కొలువుదీరిన శ్రీవారి దర్శనానికి భారీగా విచ్చేసిన భక్తులు



వీణాపాణి అవతారంలో హంసవాహనంపై శ్రీవారు

హంస వాహనంపై వీణాపాణి

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు శనివారం రాత్రి శ్రీవారు వీణాపాణిగా హంస వాహనంపై చదువుల తల్లి సరస్వతి అవతారంలో దర్శనమిచ్చారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించిన స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతుంటే ఆయన దివ్యమంగళ రూపం చూసి భక్తులు తరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉభయ దారులుగా తోటంశెట్టి రాజుగోపాల్‌శెట్టి కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

నేడు సింహ వాహనంపై శ్రీవారు
బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీశుడు ఆదివారం సింహవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. యాగశాల ప్రవేశం, నిత్యహోమాలతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం స్వామివారు తిరువీధుల్లో దర్శనమిస్తారు.

మూడు దశల్లో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు



టేబుళ్ల ఏర్పాటుపై అధికారులకు సూచనలిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి (ఫైల్)

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 16న జరగనుంది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపుతో పోలిస్తే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు భిన్నంగా ఉంటుంది. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు మూడు దశల్లోగా ఉంటుంది. ఇనిషియల్ కౌంటింగ్ (ప్రాథమిక లెక్కింపు), డిటైల్డ్ కౌంటింగ్ (సమగ్ర లెక్కింపు), ట్రాన్స్‌ఫర్ కౌంటింగ్ (బదిలీ లెక్కింపు) నిర్వహిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు డిటైల్డ్ కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా 50 శాతానికి మించి వస్తే ఇక ట్రాన్స్‌ఫర్ కౌంటింగ్ ఉండదు.

కౌంటింగ్ ఇలా...
మొదటి దశ : ఇనిషియల్ కౌంటింగ్‌లో ప్రిసైడింగ్ అధికారి డైరీ ప్రకారం రికార్డు అయిన ఓట్లు, బ్యాలెట్ పెట్టెలో ఉన్న ఓట్ల సంఖ్యను సరిచూస్తారు. ఆ ఓట్లను లెక్కించి 50 చొప్పున కట్టి ఉంచుతారు.
రెండో దశ : డిటైల్డ్ కౌంటింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా విభజించి వారికి కేటాయించిన ట్రేలలో ఉంచుతారు. అలా వచ్చిన ఓట్లను లెక్కించి కట్టలుగా కట్టి ఉంచుతారు.
మూడో దశ: ట్రాన్స్‌ఫర్ కౌంటింగ్‌లో అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత కాకుండా ఆ తరువాతి రెండో ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థులకు బదిలీ చేస్తారు. ఇలా మూడు దశల కౌంటింగ్‌కు వేరువేరుగా లెక్కింపు బృందాలు పనిచేస్తాయి.

శతాధిక వృద్ధురాలి మృతి



వృద్ధురాలు తిమ్మక్క (ఫైల్)

రొద్దం: మండలంలోని ఉప్పరపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు పోసన తిమ్మక్క(104) శనివారం మృతి చెందారు. గ్రామంలోనే అత్యధిక వయస్కురాలైన తిమ్మక్క ఇప్పటి వరకూ తన పనులు తానే చేసుకునేదని కుటుంబీకుడు తిప్పారెడ్డి తెలిపారు. ఆమె తన జీవిత కాలంలో ఎక్కువగా రాగులు, అరకలు, కొర్రలు, సజ్జలు, జొన్నలతో చేసిన ఆహార పదార్థాలే తిన్నారని, అందువల్లే ఎలాంటి రోగాలు లేకుండా 104 ఏళ్లు జీవించారన్నారు.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నల్లమాడ: మండలంలోని ఆర్.రామాపురం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో చేరడానికి, పదో తరగతి విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి అర్హులన్నారు. ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతికి, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4-30 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేవారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు ఖాళీ ఉండగా, ఎస్సీ-70, ఎస్టీ-05, బీసీ-04, ఓసీ-01 రిజర్వేషన్ ప్రకారం కేటాయించినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్ఈసీలో 40, సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీ ఉన్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా

- డీఎల్‌డీఓ శివారెడ్డి




ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేసినట్లు డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితాను చెక్ చేసి జాబితాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లాలో 54 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఒక్కో పోలింగ్‌కు 5 సెట్లు సిద్ధం చేసినట్లు వివరించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పురుషులు 29,686 మంది, మహిళా ఓటర్లు 13,620 మంది కలిపి 43,310 ఓటర్లు ఉండగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పురుషులు 2,277మంది, మహిళలు 1,071 కలిపి మొత్తం 3,348 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

- ముస్లిం మతపెద్దల ప్రార్థనలు
- కుమ్మరవాండ్లపల్లిలో ముగిసిన ఇస్తెమా



ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముస్లింలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో జరుగుతున్న ఇస్తెమా శనివారం రాత్రి ముగిసింది. రెండు రోజులుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మతపెద్దల ఆధ్యాత్మిక ప్రసంగాలను ముస్లిం సోదరులు ఆలకించారు. సుమారు 2 లక్షల మంది ఇస్తెమాకు హాజరయ్యారు. రాత్రి 7 గంటలకు దువా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలు, ఆయురోగ్యాలతో జీవించాలంటూ మతపెద్దలు దువా చేశారు. ఇస్తెమా విజయవంతమయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఇస్తెమా కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఇస్తెమాలో ఎంపీ, ఎమ్మెల్యేలు..

ఇస్తెమా ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన ఓ వ్యక్తి జనాజాను (పాడె) ఎంపీ గోరంట్ల మాధవ్ స్వయంగా మోసి సర్వమానవ సౌభ్రాతృత్వం చాటారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహ్మద్ షాకీర్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, నాయకులు పరికిసాదిక్, పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్, లీగల్ సెల్ నాయకులు లింగాల లోకేశ్వరరెడ్డి,బత్తల వెంకటరమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ముస్లింలతో కలిసి దువా చేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్



పాడె మోస్తున్న ఎంపీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

ధర్మవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన కృష్ణమూర్తి కుమారుడు ఎం. పోతులరాజు (25) ధర్మవరంలోని ఓ మార్కెటింగ్ కంపెనీలో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విధుల ముగించుకొని శనివారం రాత్రి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలో చిగిచెర్ల గ్రామం వద్దకు రాగానే స్పీడు బ్రేకర్ వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన అంగడి (చిల్లర కొట్టు)ను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న కుల్లాయప్ప, వాణి దంపతుల రెండో కుమార్తె షర్మిల (4) అనే చిన్నారిని ఢీకొని ఎగిరిపడ్డాడు. తీవ్రగాయాలపాలై ఘటనాస్థలంలోనే ప్రాణాలు వదిలాడు. గాయపడిన చిన్నారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా, మృతుని భార్య లక్ష్మి ప్రసన్న 9 నెలల గర్భిణి అని తెలిసింది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలోనే మృతి చెందిన పోతుల రాజు



చిన్నారి షర్మిల (ఫైల్)

ఇంటర్ హాల్‌టికెట్లు వచ్చేశాయ్

రాప్తాడురూరల్: ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి జరిగే థియరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు వచ్చేశాయి. శనివారం ఉదయం ఏడు గంటలకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు జ్ఞానభూమి లాగిన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు ఆర్ఐఓ సురేష్ తెలియజేశారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు వెంటనే అందజేసి, అందులో ఏమైనా పొరబాట్లు జరిగి ఉంటే రెండు రోజుల్లోగా ప్రిన్సిపాళ్ల ద్వారా తనకు ఫిర్యాదు చేస్తే బోర్డు దృష్టికి తీసుకెళ్లి సరిచేయిస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్ల జారీ సమయంలో ఫీజు చెల్లించాలనే నిబంధన పెట్టి విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలుంటాయని ఆయా కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించారు.

సీఎంఓ ప్రత్యేకాధికారి హరికృష్ణకు పితృవియోగం

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ)లో ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ హరికృష్ణకు పితృవియోగం కలిగింది. పుట్టపర్తిలో నివాసం ఉంటున్న ఆయన తండ్రి మలిరెడ్డి (86) శనివారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో కన్నుమూశారు. తండ్రి మరణవార్త తెలుసుకున్న డాక్టర్ హరికృష్ణ హుటాహుటిన పుట్టపర్తి చేరుకొన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పట్టణంలోని హరికృష్ణ నివాసానికి చేరుకుని మలిరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మలిరెడ్డి స్వగ్రామం బుక్కపట్నం మండలం సిద్దరాంపురంలో సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు చెరువుభాస్కర్‌రెడ్డి, సాయిగీత, సూర్యాగౌడ్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, నాయకులు కవిత, బ్రిక్స్‌సాయి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగిరెడ్డి, నరశింహులు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం డాక్టర్ హరికృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పరిశోధక విద్యార్థి ఆత్మహత్యాయత్నం

అనంతపురం: ఎస్కేయూ మేథమేటిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి గుజ్జల ఆంజనేయులు శనివారం ఆత్మహత్యాయత్నం చేశారు. క్యాంపస్‌లోని కృష్ణ హాస్టల్ మేడపై క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించిన సహ విద్యార్థులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామగిరి మండలం శేషంపల్లికి చెందిన ఆంజనేయులు.. ఆచార్య శోభాలత పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఇటీవల డిగ్రీ లెక్చరర్ పోస్టుకు పోటీ పరీక్ష రాశారు. ఆ పోస్టు దక్కకపోవడంతో మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. నిబంధనల మేరకు ప్రీ-పీహెచ్‌డీ పరీక్షను ఏటా రెండు దఫాలు నిర్వహిస్తారు. ఇటీవలే పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందడంతో ఆ పరీక్ష మళ్లీ రాయాల్సి ఉంటుందని గైడ్ శోభాలత పేర్కొన్నట్లు బంధువులు వెల్లడించారు. దీనికి తోడు రూ.17 వేలు మెస్ బిల్లు చెల్లించేందుకు డబ్బు లేకపోవడం కూడా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు ఆంజనేయులు తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదనే విషయం తెలుసుకున్న వర్సిటీ రెక్టార్ ఎ.మల్లికార్జున రెడ్డి తన వంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. ఆస్పత్రిలో ఆంజనేయులుని పరామర్శించి, ఆయన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ప్రస్తుతం ఆంజనేయులు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.



క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న పరిశోధక విద్యార్థి ఆంజనేయులు

లోకేష్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలే

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ధ్వజం

హిందూపురం: యువగళం పాదయాత్రకు జనం నుంచి స్పందన కరువవడంతో ఏం చేయాలో అర్థం కాని లోకేష్ ఏదేదో మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ విమర్శించారు. ఏదో ఒక నెపంతో పాదయాత్రకు మంగళం పాడటానికి సాకులు వెతుకుతున్నారని, లోకేష్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలేనని ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక ప్రశాంత్ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై బురద చల్లడానికి ప్రయత్నిస్తూ ప్రజలను లోకేష్ మభ్యపెడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమం, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్పష్టం చేశారు. టీడీపీ పాలనలో రేషనలైజేషన్ పేరిట స్కూళ్లను మూసివేసి టీచర్ల నియామకాలు లేకుండా చేశారని, నారాయణ, చైతన్య యాజమాన్యానికి వంతపాడుతూ ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన రోజులను టీచర్లు మరిచిపోలేదన్నారు. టీడీపీ పాలన కొనసాగి ఉంటే ప్రభుత్వ స్కూళ్లన్నీ మూతపడి రాష్ట్రంలో నారాయణ, చైతన్య స్కూల్స్ తప్ప ఏ పాఠశాల నడిచేది కాదని గ్రహించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. ఇంగ్లిష్ మీడియంతో విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి పెడుతున్నామని చెప్పారు. త్వరలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయనున్నారన్నారు. టీడీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎగ్గొట్టిన కారణంగా పట్టభద్రులు ఉన్నత చదువులకు దూరమయ్యారన్నారు.నిలువునా మోసగించిన విషయాన్ని వారు మరిచిపోలేదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

మొక్కు చెల్లించకుండానే అనంతలోకాలకు

- బైకును ఢీకొన్న టిప్పర్..
- దంపతుల దుర్మరణం

సోమందేపల్లి: ఓ టిప్పర్ ఆ దంపతుల పాలిట మృత్యుశకటంగా మారింది. దైవదర్శనానికి వెళ్తున్న వారిని అనంతలోకాలకు పంపింది. వివరాలు... గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన ఎర్రిస్వామి ఆచారి (48), వరలక్ష్మి(40) దంపతులు. వీరికి ఒక కుమారుడు సంతానం. ఎర్రిస్వామి ఆచారి గోరంట్లలో కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కర్ణాటకలోని పావగడ శనేశ్వరుడి మొక్కు చెల్లించుకునేందుకు శనివారం ఉదయం ఎర్రిస్వామి భార్య వరలక్ష్మితో కలిసి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మండలంలోని వెలుగమాకులపల్లి క్రాస్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ ఉండటంతో బైక్ వేగాన్ని తగ్గించాడు. ఈ సమయంలోనే వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొంది. దీంతో ఎర్రిస్వామి ఆచారి, వరలక్ష్మి ద్విచక్రవాహనంతో సహా టిప్పర్ కింద పడిపోయారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ వేగాన్ని నియంత్రణ చేయలేక వారిపై నుంచి దాదాపు 50 మీటర్లు మేర టిప్పర్‌ను ముందుకు పోనిచ్చాడు. దీంతో ఎర్రిస్వామి ఆచారి, వరలక్ష్మి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతదేహాలు రెండూ ఛిద్రమయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



టిప్పర్ కింద పడిన ద్విచక్ర వాహనం

పేకాట శిబిరంపై మెరుపుదాడి

- 16 మంది జూదరుల అరెస్ట్
- రూ.2,17,970 నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్‌బాబు

మడకశిర: గుడిబండ మండలంలోని సీసీగిరి, పీసీగిరిలో శనివారం పోలీసులు పేకాట శిబిరంపై మెరుపు దాడి చేశారు. స్థానిక సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మొత్తం 16 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 2,17,970 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూద కేంద్రాలపై విస్తృతంగా దాడులు చేస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తుంటే సమాచారం అందించాలని కోరారు. పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



పెద్దక్క (ఫైల్)

ముదిగుబ్బ: మండల పరిధిలోని పీసీరేవు గ్రామానికి చెందిన పెద్దక్క(58) అనే మహిళ శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాత్ రూమ్‌కు అమర్చిన ఇనుప డోర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అది తెలియని ఆమె ఆ డోర్‌ను తాకింది. వెంటనే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త నారాయణస్వామి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే దుకాణంలో చోరీ

- రూ.3 లక్షలకు పైగా నగదు అపహరణ



టేబుల్ డ్రాలో డబ్బు దొంగిలిస్తున్న వ్యక్తి (సీసీ కెమెరాలో కనిపించిన దృశ్యం)

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని ఓ గ్రానైట్స్ దుకాణంలో పట్టపగలే రూ.3 లక్షలకుపైగా నగదు చోరీకి గురైంది. వివరాలు.. పట్టణంలోని టీవీఎస్ షోరూం ఎదురుగా ఉన్న ఆలియా గ్రానైట్స్ దుకాణంలో శనివారం యజమాని నూర్ మహమ్మద్ టేబుల్ డ్రాలో రూ.3 లక్షలకుపైగా ఉంచాడు. గ్రానైట్స్ వేసుకుని లారీ రావడంతో కూలీలతో కలిసి లోడు దింపేందుకు బయటకు వెళ్లాడు. కూలీ పనిచేసేవాడిగా వచ్చిన ఓ వ్యక్తి దుకాణంలో ఎవరూ లేరని గమనించి కౌంటర్ వద్దనున్న టేబుల్ డ్రా తెరిచి అందులోని రూ.3 లక్షలకుపైగా నగదు బనియన్‌లో పెట్టుకుని ముఖానికి టవాల్ వేసుకుని వెళ్లిపోయాడు. గ్రానైట్స్ దింపేసి వచ్చిన దుకాణ యజమాని కూలీలకు డబ్బు ఇచ్చేందుకు టేబుల్ డ్రాలో చూడగా నగదు కనిపించలేదు. సీసీ కెమెరాను పరిశీలించగా ఓ వ్యక్తి డబ్బు తీసుకున్న దృశ్యం కనిపించింది. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి సీసీ కెమెరా పుటేజి స్వాధీనం చేసుకున్నారు. దొంగ కోసం గాలిస్తున్నారు.

'పరిటాల' అనుచరుడికి దేహశుద్ధి

రాప్తాడు రూరల్: అనంతపురం మండలం కురుగుంట సమీపంలోని కాలనీలో వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన మాజీ మంత్రి పరిటాల సునీత అనచరుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు... పరిటాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పంచాయతీ టీడీపీ కన్వీనర్‌గా కొనసాగుతున్నాడు. కనగానపల్లి మండలానికి చెందిన ఓ బీసీ కుటుంబం ఉపాధి కోసం కురుగుంట సమీపంలోని కాలనీకి వలస వచ్చింది. దంపతులిద్దరూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన సదరు టీడీపీ చోటా నాయకుడు డబ్బు సాయం చేస్తూ దగ్గరయ్యాడు. ఈ క్రమంలో వివాహితతో చనువుగా ఉండేదుకు ప్రయత్నిస్తుండడంతో భర్త దేహశుద్ధి చేశాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించేందుకు వెళుతుండగా ఇంతలోనే తన సామాజిక వర్గానికి చెందిన వారిని పెద్ద మనుషులుగా పంపి కేసు పెట్టకుండా బెదిరించారు. పైగా బాధిత కుటుంబాన్ని ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.

చౌక బియ్యం సీజ్

గోరంట్ల: బూడిద గడ్డపల్లి సమీపంలో గోరంట్ల-కోడూరు రోడ్డ పక్కన ఉన్న ఓ కాట వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 18.32 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తహసీల్దార్ రంగనాయకులు శనివారం సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి బియ్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని గోరంట్ల స్టాక్ పాయింట్‌కు తరలించారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన కాట యాజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.